
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## పీఎం ఇంటర్న్‌షిప్‌కు నమోదు చేసుకోండి

**- జిల్లా యువతకు ఎంపీ వేమిరెడ్డి విజ్ఞప్తి**



**నెల్లూరు రూరల్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం(పీఎంఐఎస్)ను జిల్లా యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక శాఖమంత్రి నిర్మలా సీతారామన్ సూచన మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. యువతలో నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఇప్పటికే గడువు ముగియగా.. మరోసారి గడువు పెంచారని, ఈ నెల 22 వరకు అవకాశం ఉందన్నారు. ఈ పథకానికి 21 24 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన యువత అర్హులని, దరఖాస్తుదారులు కనీసం పదో తరగతి లేదా దానికి సమానమైన విద్యార్హత ఉండాలన్నారు. ఈ పథకం ద్వారా ఎంపికైన అభ్యర్థులకు దేశంలోని అత్యుత్తమ 500 కంపెనీలలో 12 నెలల పాటు ఇంటర్న్‌షిప్ చేసే అద్భుత అవకాశం లభిస్తుందని చెప్పారు. ఆసక్తి ఉన్న అర్హులైన అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. పిఎంఇంటర్న్ షిప్.ఎంసి.జిఓవి.ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇంటర్న్‌షిప్ సమయంలో, యువతకు ప్రతి నెలా రూ. 5,000 స్టైపెండ్‌గా అందజేస్తారని, అంతేకాకుండా, పథకం ప్రారంభంలో వారిని ప్రోత్సహించడానికి ఒకేసారి రూ. 6,000 ప్రత్యేక ప్రోత్సాహక నిధిని కూడా అందిస్తారన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 1126 మంది నమోదు చేసుకున్నారని, మిగతావారు కూడా త్వరితగతిన రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఈ విషయంలో మరింత సమాచారం కొరకు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారిని సంప్రదించాలని సూచించారు. అందువల్ల జిల్లా యువత సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలని ఎంపీ వేమిరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

## నూతన జిల్లా, జడ్జికు అభినందనలు తెలియజేసిన కలెక్టర్



**నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త** నూతన నెల్లూరు జిల్లా జడ్జిగా, నియమితులైన శ్రీనివాస్‌ని గురువారం నెల్లూరు జిల్లా కోర్టులో మర్యాద పూర్వకంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మరియు, జాయింట్ కలెక్టర్ కే.కార్తీక్ కలిసి నూతనంగా జిల్లాకి విచ్చేసిన జిల్లా జడ్జ్ శ్రీనివాస్‌కు పుష్పగుచ్చం ఇచ్చి అభినందనలు తెలియజేశారు.


## బిజెపిని క్షేత్రస్థాయి నుండి బలోపేతం చేయాలి

**- జిల్లా అధ్యక్షులు ఎస్.వంశీదర్‌రెడ్డి**




**బుచ్చి ఏప్రిల్ 17 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం అర్బన్ ఏరియాలో బిజెపి కార్యాలయంలో పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయభవనం నందు అర్బన్ అధ్యక్షులు రామిశెట్టి కళ్యాణ్‌కుమార్ ఆద్వర్యంలో బిజెపి అర్బన్ మండల సమావేశం జరిగింది. ఈకార్యక్రమంలో ముఖ్య అతిధులుగా బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్ .వంశీదర్‌రెడ్డి, బుచ్చిరెడ్డిపాళెం అర్బన్ ఇన్‌చార్జి విజయకుమార్ పాల్గోన్నారు. ఈ సందర్భంగా వంశీదర్‌రెడ్డి మాట్లాడుతు అర్బన్ ఏరియాలో బిజెపి క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు ప్రతి నాయకుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. జిల్లా కార్యదర్శి గడ్డం విజయ్‌కుమార్ మాట్లాడుతు ప్రతినెల పార్టీ మండల సమావేశాలు తప్పకుండా జరగాలని పోలింగ్ బూత్ ఏరియాలో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఈకార్యక్రమంలో బిజెపినాయకులు కాసా శ్రీనివాసులు, మహిళా మోర్చ ఉపాద్యాక్షురాలు ఆలూరు నాగమణి, మైనార్టీ అద్యక్షులు షేక్ ఖాదర్‌బాషా,ప్రదాన కార్యదర్శి షేక్ ఖాసిం.ఎస్‌సి మోర్చ జిల్లా ఉపాధ్యాక్షులు గోళ్ళ నరసింహులు, బిజెపి,బిజెసి కిసాన్‌మోర్చనాయకులు పార్లపల్లి మహేష్, సోమా లక్ష్మయ్య, మహిమలూరు సతీష్, మాచవరం శ్రీనివాసులు, గోలి సురేంద్ర, యారాశి రామారావు, సందల నాగేశ్వరరావు, బోర్రు రామచంద్రయ్య,కనిసిరి శీనయ్య, కోణం శ్రీనివాసులు, కార్యదర్శులు గుంజిసుధాకర్,కాసావెంకట్‌నాగార్జున,సీనియర్ నాయకులు కోప్పోలు మస్తానయ్య, ఇనుగూరు సుబ్బారావు,మహిమలూరు శ్రీనివాసులు,జల్లి ప్రభాకర్, బిజెపి నాయకులు,కార్యకర్తలు పాల్గోన్నారు.

## జడ్ పీ చైర్ పర్సన్ అధ్యక్షతన ఏడవ స్థాయి సంఘ సమావేశాలు




**నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త** గురువారం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం నందు 7వ స్థాయి సంఘాల సమావేశం జిల్లా పరిషత్ అధ్యక్షురాలు అనం అరుణమ్మ, వైస్ చైర్ పర్సన్స్ అధ్యక్షత వహించారు. మొత్తం 7 స్థాయి సంఘాల సమావేశం ఉదయం 10.30 గం ల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు కొనసాగాయి. పంచాయతీ రాజ్ శాఖ, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఎ.పి.యస్.పి.డి.యస్.యల్ సంస్థ శాఖ, జిల్లా పశుసంవర్ధక శాఖ మరియు జిల్లా మత్స్యశాఖ జిల్లా విద్యా శాఖ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సేవలు శాఖ,స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, నైపుణ్యాభివృద్ధి కేంద్రం జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం శాఖ, జిల్లా షెడ్యూల్ కులముల సేవా సహకార సంస్థ శాఖ, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ, జిల్లా నీటిపారుదల శాఖ, జిల్లా నీటి యాజమాన్య సంస్థతో సమీక్ష నిర్వహించడం జరిగింది. ఈ ఏడు స్థాయి సంఘాల సమావేశం నకు జిల్లాలో గల ప్రభుత్వ విభాగాల అధికారులు హాజరయ్యి వారి వారి విభాగానికి సంబంధించి అనేక అంశాలను వాటి ప్రస్తుత ప్రగతి గురించి హాజరైన సభ్యులకు వివరించారు. ఈ సమావేశానికి జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ విద్యారమ, జెడ్పిటిసిలు, నెల్లూరు, తిరుపతి జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

## అబ్దుల్ అజీజ్‌ను కలిసిన సజీల



**నెల్లూరు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త** గుంటూరు కార్పొరేషన్ ఇన్‌ఛార్జీ మేయర్ షేక్ సజీల ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్‌ను నెల్లూరు నగరంలోని హరినాథపురం లో ఉన్న అజీజ్ నివాసంలో ఆయనని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్, సజీలను సజీల అబ్దుల్ అజీజ్‌ను సత్కరించారు. అనంతరం వారు పలు కీలక అంశాలపై చర్చించారు.

## లక్ష్మీనారాయణకు స్వాగతం పలికిన సోమిరెడ్డి



**నెల్లూరు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త - వైద్యం** తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు మాజీ శాసనమండలి సభ్యుడు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అనంతపురం ఎంపీ లక్ష్మీ నారాయణకి ఘన స్వాగతం పలికాడు. గురువారం నెల్లూరు పర్యటనలో భాగంగా నగరానికి విచ్చేసిన ఎంపీ లక్ష్మీ నారాయణని నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని వేదయపాలెంలో ఉన్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తన కార్యాలయంలో లక్ష్మీనారాయణతో భేటీ అయ్యారు. అనంతరం వారిరువురు పలు అంశాలను చర్చించుకున్నారు.

# జిల్లాలో రబీకి 3 లక్షల పైగా ఎకరాలకు సాగునీరు

- 41 టీఎంసీలు నీటిని కేటాయిస్తూ సాగునీటి సలహా మండలి తీర్మానం
- మే 5 నుంచి నీటి విడుదలకు చర్య
- భవిష్యత్తు అవసరాల దృష్ట్యా నీటిని పొదుపుగా వాడుకోవాలి
- సాగునీటి కేటాయింపుల్లో నీటి సంఘం అధ్యక్షులు కీలక పాత్ర పోషించాలి
- లష్కర్ల జీతాల బకాయిల చెల్లింపునకు కృషి చేస్తాం
- జిల్లాలో మేజర్ ఇరిగేషన్ పనులకు రూ. 18 కోట్లు
- ఉపాధి హామీ ద్వారా మైనర్ ఇరిగేషన్ పనులు చేపడుతాం
- ఇరిగేషన్ అధికారులు బాధ్యతగా పనిచేయాలి..
- లేకుంటే చర్యలు తప్పవు రైతుల అవసరాలకు తగ్గట్లు నాలుగు లక్షల విత్తనాలు సిద్ధం

**- మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి**




**నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త** రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా జిల్లాలో రెండో పంట రబీకి సంబంధించి 3లక్షల పైగా ఎకరాలకు 41 టిఎంసిల నీటిని కేటాయిస్తూ సాగునీటి సలహామండలిలో తీర్మానించినట్లు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు. గురువారం ఉదయం నగరంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో జిల్లా సాగునీటి సలహామండలి సమావేశం జిల్లా కలెక్టర్ ఆనంద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, సర్వేపల్లి, నెల్లూరు రూరల్, కోవూరు, ఉదయగిరి, కావలి ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కాకర్ల సురేష్, దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, ప్రాజెక్ట్, డిస్ట్రిబ్యూటరీ, నీటిసంఘాల అధ్యక్షులు, రైతుసంఘాల నాయకులు, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సోమశిల, కండలేరు జలాశయాల్లో ప్రస్తుత నీటి నిల్వలు, ఎంతమేర రబీ పంటకు నీటిని కేటాయించాలి, చెన్నై, తిరుపతికి తెలుగుగంగ ద్వారా నీటి కేటాయింపులు, సాగునీటి కాలువల నిర్వహణ, పూడికతీత, గుర్రపుడెక్క తొలగింపు, లష్కర్లకు జీతాల బకాయిల చెల్లింపు మొద్కలెన అంశాలపై మంత్రి ఆనం, ఎమ్మెల్యేలు, జిల్లాలో నూతనంగా ఎన్నికైన నీటి సంఘాల అధ్యక్షులు ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన నీటిసంఘాల అధ్యక్షులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. సుమారు ఆరేళ్ల అనంతరం తమ ప్రభుత్వం నీటిసంఘాలకు అధ్యక్షులను, సభ్యులను నియమించినట్లు చెప్పారు. రైతులకు అన్నివిధాలా అండగా వుండాలనే ప్రధానలక్ష్యంతోనే నీటిసంఘాలకు ఎన్నికలు నిర్వహించినట్లు చెప్పారు. నీటి సంఘాల అధ్యక్షులందరూ సాగునీటి యాజమాన్యంలో కీలక భూమిక పోషించాలని మంత్రి పిలుపునిచ్చారు. రబీ పంట అవసరాల మేరకు ఏ ప్రాంతాల్లో నీరు ఎక్కువగా కావాలి, ఎక్కడ తక్కువగా కావాలో అంచనా వేసి ఎమ్మెల్యేలు, రైతుల సూచనల మేరకు నీటిని విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. మే నెల 5వ తేదీ నుంచి సోమశిల జలాశయం నుంచి నీటిని పంట కాలువలకు విడుదల చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. జిల్లాలో ప్రస్తుతం సోమశిల జలాశయం పరిధిలో 52.653 టిఎంసీల నీటినిల్వ, కనిగిరి సర్వేపల్లి రిజరాయర్లలో 3.615 టిఎంసిల నీటి నిల్వ కలిపి మొత్తం 56.268 టిఎంసిల నీటినిల్వలో డెడ్ స్టోరేజి 7,500టిఎంసిలు, నీటి ఆవిరి 1500 టిఎంసిలు, నెల్లూరు కార్పొరేషన్, కావలి, అల్లూరు, ఆత్మకూరు తదితర పట్టణాల తాగునీటి అవసరాలకు 3,500 టిఎంసిలు మొత్తం 12.500 టిఎంసిల నీరు మినహాయించగా 43.768 టిఎంసిల నీటి లభ్యత ఉన్నట్లు మంత్రి చెప్పారు. ఇందులో సుమారు 36 టిఎంసిల వరకు నీటిని పొదుపుగా రబీ పంట సాగునీటి అవసరాలకు వినియోగించుకుని 10 టిఎంసిల నీటిని భవిష్యత్ అవసరాలు, రాబోయే ఖరీఫ్ పంట కోసం నీటిని నిల్వచేసుకునేలా ప్రణాళికాబద్దంగా నీటిని వాడుకునేందుకు అందరూ సహకరించాలని మంత్రి కోరారు. ఈ నీటి లభ్యత ఆధారంగా పెన్నా డెల్టా ఆయకట్టుకు 2లక్షల ఎకరములకు, కనుపూరు కాలువ 25వేల ఎకరాలు, సోమశిల ప్రాజెక్టు కాలువ కింద 1.44లక్షల ఎకరములు మొత్తం 3.69 లక్షల ఎకరాల ఆయకట్టుకు 43.42 టిఎంసిల నీటి కేటాయింపును అధికారులు ప్రతిపాదించగా, ఐఎబీ సమావేశంలో ఎమ్మెల్యేలు, నీటి సంఘాల అధ్యక్షులు అందరి ఆమోదం మేరకు రెండో పంట రబీకి సుమారు 3లక్షల పైగా ఎకరాలకు 41 టిఎంసిల నీటిని కేటాయించాలని తీర్మానించినట్లు చెప్పారు. ఈ మూడునెలలు ఇరిగేషన్ అధికారులు నీటిసంఘాల అధ్యక్షులతో కలిసి రైతులకు సక్రమంగా నీటిని అందించాలని, ఎక్కడైనా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించినా, అక్రమాలకు పాల్పడినా ఎవరినీ ఉపేక్షించే ప్రసక్తే లేదని మంత్రి హెచ్చరించారు. మనమంతా కూడా రైతులకు నీరు అందించడమే ప్రధానలక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో మేజర్, మైనర్ ఇరిగేషన్ పనులకు ప్రభుత్వం 18కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందన్న మంత్రి ఆనం, ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, నీటిసంఘాల అధ్యక్షుల సలహాల మేరకు ప్రాధాన్యతాక్రమంగా పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. మైనర్ ఇరిగేషన్ కాలువల పూడికతీత, గుర్రపుడెక్క తొలగింపు పనులను ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టనున్నట్లు మంత్రి చెప్పారు. ఎంపిడివోలు, డ్వామా సిబ్బంది, ఇరిగేషన్, నీటిసంఘాల అధ్యక్షుల సమన్వయంతో ఈ పనులు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. జిల్లాలో సాగునీటికాలువ పరిధిలో రైతులు రూ.38కోట్ల నీటిపన్ను బకాయిలు చెల్లించాలని మంత్రి ఆనం చెప్పారు. ఈ పన్ను బకాయిలు వసూలైతే ఆ నిధులను జిల్లాలో కాలువల మెయింటెనెన్స్‌కు మనమే వినియోగించు కోవచ్చన్నారు. ఈ పన్నుల వసూలుకు నీటిసంఘాల అధ్యక్షులు సహకారం అందించాలన్నారు. రైతులందరూ తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలు వేసేలా వ్యవసాయాధికారులు ఈనెల 21 నుంచి 30వరకు ముమ్మరంగా అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. అన్నిరకాల విత్తనాలను సిద్ధంగా చేసుకోవాలని, ఎక్కడైనా విత్తనాల కొరత వుంటే ముందుగా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అవసరమైన విత్తనాలు అందుబాటులో వుంచుకోవాలని సూచించారు. 4లక్షల ఎకరాలకు తక్కువ కాకుండా ధాన్యం విత్తనాలను సిద్ధం చేసుకోవాలన్నారు. లష్కర్ల జీతాల బకాయిల చెల్లింపు విషయమై నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారిస్తామని మంత్రి చెప్పారు. జిల్లాలో సుమారు 4.68 కోట్ల బకాయిలు లష్కర్లకు చెల్లించాల్సి వుందని, ఇవన్నీ గత ప్రభుత్వ బకాయిలన్నారు. ఏదేమైనా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి లష్కర్లకు జీతాలు చెల్లించడం తమ బాధ్యతగా మంత్రి చెప్పారు. శాసనసభ్యులు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి చెప్పారు. జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి 191 కోట్ల రూపాయల విలువైన 1.09 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసినట్లు మంత్రి చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ధాన్యం విక్రయించిన 24 నుంచి 48 గంటల్లోనే రైతుల ఖాతాలకు నగదు జమచేశామని, రైతుల పట్ల తమ ప్రభుత్వానికి వున్న చిత్తశుద్ధికి ఇది ఒక నిదర్శనంగా మంత్రి ఆనం చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి, కూటమి ప్రభుత్వానికి మంత్రి ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు. గత రెండు రోజుల క్రితం సర్వేపల్లి నియోజకవర్గంలో కురిసిన వర్షాలు, ఈదురుగాలులకు దెబ్బతిన్న పంటనష్టాన్ని అంచనా వేసి నివేదికను అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ నివేదిక ఆధారంగా రైతులను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని మంత్రి చెప్పారు.

### నీటి సంఘాల అధ్యక్షులు కీలకంగా పనిచేయాలి

**: ఎమ్మెల్యే సోమిరెడ్డి**



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సోమశిల, కండలేరు జలాశయాల్లో 100 టిఎంసీల నీటి నిల్వలు గల ఏకైక జిల్లా నెల్లూరు జిల్లా మాత్రమేనని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి అన్నారు. సాగునీటి నిర్వహణలో నీటి సంఘాల అధ్యక్షులు కీలకంగా పనిచేయాలన్నారు. నీరు వృథాకాకుండా అవసరం మేరకు పొదుపుగా వాడుకోవాలని సూచించారు. సర్వేపల్లి నియోజకవర్గంలో సర్వేపల్లి, కృష్ణపట్నం కాలువల కింద చాలామంది రైతులు రెండో పంట వేయలేదన్నారు. పంటలు వేసిన రైతులకు మాత్రం ఇబ్బందులు లేకుండా నీటిని విడుదల చేయాలన్నారు. ప్రధాన కాలువల్లో పనులకు నిధులు మంజూరు కాగా, చిన్నకాలువల్లో ఉపాధిహామీ ద్వారా పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో పనులు చేయకుండానే బిల్లులు స్వాహా చేశారని మండిపడ్డారు. ఒక్క సర్వేపల్లి నియోజకవర్గంలోనే 150కోట్లు కాజేశారని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి బాగోలేదని, ప్రభుత్వం మంజూరు చేసిన ప్రతిరూపాయిను కూడా వృథాకాకుండా పనులు చేయాలన్నారు.

### చివరి ఆయకట్టు వరకు నీరందించాలి

**: ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి**



కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోనే అతిపెద్ద డెల్టా ప్రాంతం కోవూరు అని, 1.93 లక్షల మెట్రిక్ టన్నులతో కోవూరు నియోజకవర్గ రైతులు 500కోట్ల టర్నోవర్ సాధించినట్లు చెప్పారు. సకాలంలో వర్షాలు పడడం, ధాన్యం కొనుగోళ్లలో అధికారుల సహాయ సహకారాలతో రైతులు సుభిక్షంగా వున్నారన్నారు. కనిగిరి, జాఫర్ సాహెబ్ కాలువల్లో పూడికతీత పనులు చేయాలని కోరారు. చివరి ఆయకట్టు వరకు నీరు అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని, ఇదే తమ లక్ష్యంగా ఆమె చెప్పారు. అలాగే లష్కర్లకు జీతాలు చెల్లించేందుకు కృషిచేయాలని మంత్రి ఆనంను ప్రశాంతిరెడ్డి కోరారు.

### డిఆర్ ఛానల్ పనులు చేపట్టాలి

**: ఎమ్మెల్యే కృష్ణారెడ్డి**



ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారం చేపట్టిన తరువాత సకాలంలో వర్షాలు పడి అన్నదాతలు సంతోషంగా వున్నారన్నారు. కావలి కాలువ, దగదర్తి డిఆర్ ఛానల్ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. డిఆర్ ఛానల్ పరిధిలో 70వేల ఎకరాలకు నీరందించాల్సి వుందన్నారు. సాగునీరు వదిలేందుకు ముందుగానే కాలువల అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఆయన కోరారు. మే 10లోగా నీరు విడుదల చేయాలన్నారు.

### ఉదయగిరిని ప్రత్యేకంగా చూడాలి

**: ఎమ్మెల్యే కాకర్ల సురేష్**



మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గాన్ని ప్రత్యేకంగా చూడాలని ఎమ్మెల్యే సురేష్ మంత్రి ఆనంను కోరారు. డిస్ట్రిబ్యూటరీ ఛానల్స్‌ను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలన్నారు. కాకుటూరు, కొండాపురం, గండిపాలెం ప్రాజెక్టులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. తన నియోజకవర్గంలో 149 నీటిసంఘాలు వున్నాయని, 8 మండలాలు వుండగా కేవలం 2 మండలాలకే సోమశిల జలాలు అందుతాయని, మిగిలిన 6 మండలాలు పూర్తిగా వర్షంపైనే ఆధారపడినట్లు ఎమ్మెల్యే సురేష్ వివరించారు. ఉదయగిరిని ప్రత్యేకంగా పరిగణించి నీటిని కేటాయించాలని, కాలువల మరమ్మతు పనులు చేపట్టాలన్నారు. గండిపాలెం ప్రాజెక్టు నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలని కోరారు.

### స్వర్ణముఖికి 3 టిఎంసిలు కేటాయించాలి

**: ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్‌చక్రవర్తి**

తిరుపతి జిల్లా గూడూరు, సూళ్లూరుపేట, తిరుపతి పట్టణాలకు నీటిని 4.75 టిఎంసిలు కేటాయించడం చాలా సంతోషంగా వుందని, ఇందుకు మంత్రి ఆనంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి చెప్పారు. కోట, వాకాడు, చిట్టమూరు, నాయుడుపేట మండలాల ప్రధాన నీటివనరు అయిన స్వర్ణముఖి కింద 48చెరువులకు ఒకటిన్నర టిఎంసి, తాగునీటి అవసరాలకు 0.75 టిఎంసిలు కేటాయించినట్లు చెప్పారు. దీనిని 3 టిఎంసీలకు పెంచాలని కల్యాణ్ చక్రవర్తిని మంత్రిని కోరారు. ఈ సమావేశంలో సోమశిల, పెన్నాడెల్టా, కందుకూరు కెనాల్ ప్రాజెక్టు కమిటీల చైర్మన్లు కేశవచౌదరి, రాజగోపాల్, మస్తానయ్య, కందుకూరు సబ్‌కలెక్టర్ శ్రీపూజ, ఆత్మకూరు ఆర్డీవో పావని, ఇరిగేషన్, సోమశిల, తెలుగుగంగ ఎస్‌ఈలు దేశ్‌నాయక్, వెంకటరమణారెడ్డి, రాధాకృష్ణారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, ఉద్యానవనశాఖ అధికారి సుబ్బారెడ్డి, ఎపిఎంఐపి పిడి శ్రీనివాసులు, సోమశిల ఈఈ మల్లికార్జున, సోమశిల, తెలుగుగంగ, ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు, రైతుసంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్సవాలపై అధికారుల చిన్నచూపు

- ..బ్రహ్మోత్సవాలపై ఇప్పటివరకు జరగని సమీక్ష
- ..స్వామి వారి టెండర్లకు సైతం ప్రచారం కరువు
- ..బ్రహ్మోత్సవాలకు పెస్టివల్ కమిటీయే నా



**పెంచలకోన (రాపూరు), ఏప్రిల్ 17, ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాలపై అధికారులు చిన్నచూపు చూస్తున్నట్లు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రతి ఏడాది వైశాఖమాసంలో అత్యంత వైభవంగా నిర్వహించడం అనవాయితీగా వస్తుంది. ఈ బ్రహ్మోత్సవాలకు ఉమ్మడి నెల్లూరు జిల్లా నుండే కాక కడప,చిత్తూరు,అనంతపురం ఉమ్మడి జిల్లాల నుండి తమిళనాడు,కర్నాటక రాష్టాలనుండి కూడా లక్షల సంఖ్యలో భక్తులు హాజరైతుంటారు. ఈ ఏడాది మే 8వ తేది నుండి 14వ తేది వరకు స్వామి వారి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ప్రతి ఏడాది బ్రహ్మోత్సవాలకు నెలకు ముందుబ్రహ్మోత్సవాలకు సంబందించి భక్తుల సౌకర్యార్థం తీసుకోవాల్సిన వివిద ఏర్పాట్లపై నెల్లూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యలయంలో శాఖలవారిగా సమీక్ష నిర్వహించి వారు తీసుకోనే చర్యలను వివరిస్తారు. అనంతరం 15 రోజులకు పెంచలకోనలో తిరిగి సమీక్ష నిర్వహించి తోలి సమీక్షలో తెలిపిన మేరకు ఎటువంటి ఏర్పాట్లు చేసారో తెలుసుకుంటారు. అయితే ఈ ఏడాది బ్రహ్మోత్సవాలకు కేవలం 20 రోజులే సమయం వున్నప్పటికి ఇప్పటివరకు ఎటువంటి సమీక్షలు నిర్వహించలేదు.గతంలో నెల రోజుల ముందుగా స్వామి వారి బ్రహ్మోత్సవాలకు సంబందించి పాంప్లెట్లు, కరపత్రాలు ముద్రించి జిల్లాలోని అనేక చోట్ల గోడలకు, ఆర్టీసి బస్సులకు బ్రహ్మోత్సవాల కరపత్రాలను అంటించి స్వామి వారి బ్రహ్మోత్సవాలకు విసృత ప్రచారం కల్పించేవారు. కాని ప్రస్తుతం స్వామి వారి బ్రహ్మోత్సవాలకు ప్రచారం కూడా కరువైనట్లు భక్తులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ఆలయంలో వివిద పనులకు, బ్రహ్మోత్సవాలలో తాత్కాలిక అంగళ్ళు ఏర్పాటకు టెండర్లు పిలిచే సమయంలో పత్రికలలో ప్రచురించడంతో పాటు, రాపూరులోని రెవెన్యూ కార్యలయం,యంపీడీఓ కార్యలయం నోటిసు బోర్డులలో టెండర్లుకు సంబందించి వివరాలను ప్రదర్శించేవారు. కాని గత కోద్దిరోజులుగా అధికారులు కేవలం పత్రికలలో ప్రకటనలు ఇస్తున్నారు కాని రెవన్యూ,మండల కార్యలయాల బోర్డులలో ఎటువంటి నోటీసులు ప్రదర్శించడం లేదు. కోనలో టెండర్లలో దుకాణాలు నిర్వహించే వారు దేవస్థానంలో టెండర్ల సమయంలో సూచించిన ధరలకు కాకుండా అత్యధిక ధరలకు సామాగ్రీ విక్రయిస్తున్నారు. ఇది ఎమిటని ప్రశ్నిస్తే మీకు దిక్కువున్న చోట చెప్పుకోండి అంటూ దౌర్జన్యాలు చేస్తున్నారు. ఆలయ అధికారుల అండదండలతోనే వారు అధిక ధరలకు విక్రయిస్తున్నారని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వామి వారి ఆలయం వద్ద ఇంత జరుగుతున్నా దుకాణదారులు అధిక ధరలకు అమ్ముతున్న విషయం అధికారులకు తెలియక పోవడం విశేషరాష్ట్ర దేవదాయ,ధర్మాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ,వెంకటగిరి ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణ, జిల్లా దేవాదాయ శాఖాధికారులు కోన బ్రహ్మోత్సవాలపై సమీక్షలు నిర్వహించి బ్రహ్మోత్సవాలలో భక్తులకు మంచి సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ,అలాగే కోనలో ఆధిక ధరలకు విక్రయాలు జరగ కుండా చర్యలు తీసుకోవల్సిన అవసరం వుందిన భక్తులు తెలుపుతున్నారు.

బ్రహ్మోత్సవాలకు పాలకమండలి నియామకం వుందా లేక పెస్టివల్ కమిటీయేనా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు పెంచలకోన ఆలయానికి పాలకమండలి ఏర్పాటు చేయలేదు. దీంతో కోనలో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ స్వామి వారి బ్రహ్మోత్సవాలపై సమీక్షలను నిర్వహించడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలకు పాలకమండలి నియామకం వుందా లేదా అని భక్తులు చర్చించుకుంటున్నారు. అయితే ప్రస్తుతం బ్రహ్మోత్సవాలకు కేవలం పెస్టివల్ కమిటియే వుంటుందని అధికార పార్టీ నేతలు తెలుపుతున్నారు.



## పంచేడు అంగన్‌వాడీలో పోషన పక్వాడ్



**బుచ్చి ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని కోవూరు ప్రాజెక్టు పరిధిలోని దామరమడుగు సెక్టార్‌లోని పంచేడు మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కె.ఉమా పాల్గొన్నారు.ఆమె మాట్లాడుతూ పోషన్ పక్వాడ్ 1000 రోజులు ప్రాముఖ్యత గురించి వివరించారు. పౌష్టికాహారం,రక్తహీనత గురించి మరియు తల్లిపాలు విశిష్టత గురించి తెలియ జేశారు. ఈకార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి జి.రజిని,వెల్ఫేర్ అధికారిణి లక్ష్మీప్రసన్న, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సిహెచ్.తనూజా, ఆశావర్కర్ ఎన్.కళ్యాణి, అంగన్ వాడీ కార్యకర్తలు ఎం .సస్నాపమ్మ, కె.యశోద, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**కావలి, ఏప్రిల్17 ప్రభాతవార్త :** కావలి పట్టణ రాఘవేంద్రకాలనీలో నివసిస్తున్న వరిమి కొండపనాయుడు, కళ్యాణి దంపతుల గృహప్రవేశ కార్యక్రమంలో గురువారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పాల్గొన్నారు. గృహ యజమానులను ఆశీర్వదించారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఎమ్మెల్యే వెంట టిడిపి లీగల్‌సెల్ కావలి నియోజకవర్గ కన్వీనర్ గుంటుపల్లి రాజ్‌కు మార్‌చౌదరి, కండ్లగుంట మధుబాబునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలపట్ల విద్యార్థులు ఆసక్తిని పెంపొందించుకోవాలి ఎమ్మెల్యే



**కావలి, ఏప్రిల్17 ప్రభాతవార్త :** విద్యార్థిదశనుండే విద్యార్థులు క్రీడలపట్ల ఆసక్తి పెంపొందించుకుంటూ క్రీడల్లో మంచి నైపుణ్యాన్ని ప్రదర్శించి దేశంలో, రాష్ట్రంలో కావలి కీర్తిబావుటాను ఎగురవేయాలని కావలి ఎమ్మెల్యే పిలుపు నిచ్చారు. మీకోసం స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో కావలి జెడ్పీగ్రౌండ్స్‌లో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో గెలుపొందిన మీకోసం క్రికెట్‌ట్రోఫీని ముసునూరు వారియర్స్ టీమ్ సభ్యులు కైవసం చేసుకున్నారు. వారికి కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి అభినందనలు తెలుపుతూ గురువారం ట్రోఫీ, మెడల్, సర్టిఫికెట్స్ అందచేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దగుమాటి మాట్లాడారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోకూడా నైపుణ్యం సాధించాలన్నారు. క్రీడలు మానసికోల్లాసానికి, దేహదారుఢ్యానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో మీకోసం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రాయపాటి దిలీప్ మార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడానైపుణ్యాన్ని వెలికితీయాలన్న సంకల్పంతో క్రికెట్‌టోర్నమెంట్ నిర్వహించామన్నారు. ఈ టోర్నమెంట్‌లో పోటాపోటీగా అన్ని టీమ్‌లు పోటీపడగా అంతిమంలో ముసునూరు వారియర్స్ టీమ్ అన్ని విభాగాల్లో చక్కగా రాణించి, విజయం సాధించి మీకోసం ట్రోఫీని అందుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. కావలి అభివృద్ధిప్రదాత, నిత్యప్రజాసేవకుడు క్రీడలు ప్రోత్సహించే ఎమ్మెల్యే దగుమాటి చేతులమీదుగా ట్రోఫీ మెడల్స్ సర్టిఫికెట్లు అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి లీగల్‌సెల్ కావలి నియోజకవర్గ కన్వీనర్ గుంటుపల్లి రాజ్‌కుమార్‌చౌదరి, టోర్నమెంట్ నిర్వహించిన డానియేల్‌బాబ్జి, ఎంపైర్స్‌గా ఆర్డీఎస్ నిఖిత్, ముజిబ్‌లు వ్యవహరించారు.

## ఆఫీస్ సబార్డినేట్ బాల ఓబులేసుకు ఘనంగా వీడ్కోలు సన్మాన సభ



**పొదలకూరు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విరువురులో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తూ పదోన్నతి పై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చేజర్లకు వెళ్లినటువంటి కె బాల ఓబులేసు వీడ్కోలు, సన్మాన కార్యక్రమం విరువురు హైస్కూల్ నందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు బి. పద్మజా ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు బోధనేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు చాలా ఉత్సాహంగా ఆనందంగా ఈ కార్యక్రమాన్ని జరుపుకున్నారు. బాల ఓబులేసు పాఠశాల సిబ్బంది, విద్యార్థులకు అందరికీ మంచి విందు భోజనాన్ని ఏర్పాటు చేసి వారికి ఈ పాఠశాలపై ఉన్న ఆదరాభిమానాలను చాటుకున్నారు.

## జాతీయ రహదారిపై వ్యక్తిని ఢీకొన్న బొలెరో వాహనం



**మర్రిపాడు, ఏప్రిల్17, ప్రభాతవార్త:** మర్రిపాడు మండలం బాట సమీపంలో ఎన్‌హెచ్ 567 జాతీయ రహదారిపై గురువారం ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో నల్లిపోగు చెన్నయ్య(55) మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు నల్లిపోగు చెన్నయ్య రోడ్డు దాటే సమయంలో వేగంగా వస్తున్న బొలెరోవాహనం బలంగా ఢీకొనడంతో చెన్నయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు పోలీసులకు సమా చారం ఇవ్వ దంతో ఘటనా ప్రదేశానికి చేరుకున్న ఎస్ఐ శ్రీనివాసరావ్ ప్రమాదానికి కారణమైన వాహనాన్ని బ్రాహ్మణపల్లి టోల్‌ప్లాజా వద్ద పట్టుకున్నారు. ప్రమాదంలో మృతి చెందిన నల్లిపోగు చెన్నయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలి ంచారు.

## పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలి



**దగదర్తి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** దగదర్తి మండలంలోని తిరువీధిపాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణపక్వాడా కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జే.ఎ ాణి పాల్గొని మాట్లాడారు. తల్లులు, గర్భవతులకు పలు సూచనలు చేశారు. పౌష్టికాహారం విధిగా తీసుకోవాలని సూచించారు. వెయ్యి రోజులు బంగారు రోజుల గురించి గర్భవతులకు బాలింతలకు తల్లులకు వివరిం చారు. గర్భవతులు ప్రతి నెల డాక్టర్ల సలహాలు మేరకు టీకాలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రభు త్వం అందించే పౌష్టికాహారం పాలు, గుడ్లు, ఆకు కూరలు, చిక్కీలు క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. పిల్లల్లో ఊబకాయని తగ్గించడానికి ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. గర్భిణీ స్త్రీలు కిషోర బాలికల్లో రక్తహీనత నివారణ కొరకు ఆరోగ్య శాఖ వారు ఇచ్చే విటమిన్ మాత్రలను సి విటమిన్ లను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త కోటేశ్వరి, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.


## వైభవంగా షిరిడీ సాయినాథునికి పూజలు





**కోవూరు, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** కోవూరులోని జాతీయ రహదారిలో వెలసి ఉన్న షిరిడీ సాయి మందిరంలో చైత్రమాస గురు వారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు జగ దీష్ స్వామి ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదా యబద్ధ ంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి అన్నదాన కార్యక్ర ీమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయక ీర్తలుగా ఉయ్యూరు శ్రీకాంత్, శివానిలు వ్యవహరించారు. అనంతరం స్వామి వారికి పల్లకి సేవ కన్నులపండువగా చేపట్టారు. ఈ కార్యక్ర ీమంలో మందిర వ్యవస్థాపకులు పచ్చిపాల సుజాత, ఫౌండర్ ట్రస్టీ పచ్చిపాల గోపాల్‌రెడ్డి, ధర్మకర్తలు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, పచ్చిపాల మల్లికార్జున్‌రెడ్డి, భక్తులు ఉన్నారు. అంతకుముందు మం దిర ప్రాం తంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో గురువారం పచ్చిపాల విజయ లక్ష్మి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల సహకారంతో మజ్జిగను అందజేశారు.

## పాఠశాల భవనాలను పూర్తిచేయండి: ఎంపిటిసి రావెళ్ళ



**వరికుంటపాడు, ఏప్రిల్17, ప్రభాతవార్త:** నిర్మాణ దశలో ఆగివున్న పాఠశాల భవనాలను పూర్తిచేయాలని జట్‌పి స్టాండింగ్ కమిటి సమావేశంలో జట్‌పిటిసి సభ్యుడు రావెళ్ళ నాగేంద్ర అదికారులనుకోరారు. బుదవారం జట్‌పి చైర్మన్ ఆనం అరుణమ్మ అద్యక్షతన జరిగిన జట్‌పి స్టాండింగ్ కమిటి సమావేశంలో పాల్గొన్న జట్‌పిటిసి రావెళ్ళ నాగేంద్ర మండలంలో నెలకొన్న విద్యా,వైద్య సమస్యలపై లేవనెత్తారు. పాఠశాల భవనాలు నిర్మాణ దశలో ఆగివున్నాయని తెలుపడంతో 20శాతం మిగిలివున్న భవనాలను త్వరితగతిన పూర్తిచేస్తామని జట్‌పి చైర్మన్ హామీఇచ్చినట్లు ఆయన తెలిపారు. స్టాండింగ్‌కమిటి సమావేశంలో మండల సమస్యలపై గళమెత్తిన జట్‌పిటిసి రావెళ్ళ నాగేంద్రాను మండల ప్రజానీకం అభినందించారు.

## ప్లకార్డులతో ఎన్ఎంయూ నిరసన



**కోవూరు, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆర్టీసీ నెల్లూరు జోనల్ వర్క్‌షాప్‌లో గురువారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై ప్లకార్డులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. జోనల్ వర్క్‌షాప్ రాష్ట్ర కార్యదర్శి ఎం. ఎల్లయ్య మాట్లాడుతూ అనేక పర్యా యాలు మేనేజింగ్ డైరెక్టర్‌కు మెమెరా ఒడమ్ ఇచ్చినా ఆ సమస్యలు నేటికీ పరిష్కారానికి నోచుకోలేదన్నారు. తమ న్యాయమైన కోర్కెల పరి ష్కారం కోసం తాము నిరసన వ్యక్తం చేస్తున్నా యాజమాన్యంలో మాత్రం ఎటువంటి స్పందన లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్‌లు చర్చలు జరిపి తమ న్యాయమైన సమస్యలు పరిష్క రించాలన్నారు. ఎన్ఎంయూ నేతలు ఎస్‌డీ సాజుద్దీన్, డీఐఎన్ రెడ్డి, కె. సుధాకర్‌రెడ్డి, కె. రవీంద్ర, ఆర్‌వీ భాస్కర్‌రావు, కెఎస్ రావు, డి. దయాకర్, బీఎంజీ రమణ, తదితరులు ఉన్నారు.

## పాఠశాల అభివృద్ధికి ట్రస్టు శ్రీకారం



**కోవూరు, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల అభివృద్ధికి పచ్చిపాల రామనా థమ్మ ఎడ్యుకేషనల్ ట్రస్టు ముందుకు వచ్చింది. ఈ మేరకు జిల్లాపరిషత్ అధి కారుల సూచనలు, మండల పరిషత్ అధి కారుల సహకారంతో ట్రస్టు పలు అభి వృద్ధి కార్యక్రమాలకు గురువారం శ్రీకారం చుట్టింది. ఈ పాఠశాలకు వెళ్లే రహదారికి ఒక వైపు గోడ పలు చోట్ల పూర్తిగా ధ్వంసమైంది. ట్రస్టు ద్వారా ఈ ప్రహరీ ఏర్పాటు, అదే విధంగా రూ. 10 లక్షల వ్యయంతో పాఠశాలలో విద్యార్థినులకు మరుగుదొడ్లు సౌకర్యం కల్పిం చేలా చర్యలు తీసుకు ంటున్నట్లు ట్రస్టు కార్యదర్శి డాక్టర్ పచ్చిపాల మల్లికార్జునరెడ్డి తెలిపారు. ప్రస్తుతం చేపడుతున్న పనులను గురువారం ఎంపీడీవో శ్రీహరి, పంచాయతీరాజ్ డీఈ మోహన్‌రావు, పాఠశాల ప్రధానో పాధ్యాయిని ఝాన్సీ రాణి పరిశీలించారు. ఫిజికల్ డైరెక్టర్ దేవిక, గీతామాధురిలు ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



**కోవూరు, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన మెరుగైన విద్యను అందిస్తున్నారని, తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలను సద్విని యోగం చేసుకోవాలని మండల విద్యా శాఖ అధికారి -2 వై. చెంచులక్ష్మమ్మ అన్నారు. కోవూరులోని జెబీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు గురువారం కోవూరు పురవీధుల్లో ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు మంచి తర్ఫీదుతో పాటు ఉన్నత చదువులు చదివిన వారు విద్యార్థులకు విద్యను అందిస్తున్నారన్నారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు విద్యకు సంబంధించిన పుస్తకాలు బ్యాగ్, షూస్‌తో పాటు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కూడా అందజేయడం జరుగుతుందన్నారు. దీనికి తోడు ఈ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఎటువంటి ఫీజులు కట్టవలసిన అవసరం లేదన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో తమ బిడ్డలను చేర్పించి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెబీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు షరీఫ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి




**కోవూరు ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** పూర్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యాబుద్ధులు అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక తెలిపారు. కోవూరు సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు తప్పనిసరిగా పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని అదేవిధంగా అంగన్‌వాడీ సేవలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకో వాలన్నారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

## రేషన్ కార్డుదారులు ఈకేవైసీ తప్పనిసరి



**కోవూరు, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** కోవూరు మండలానికి సంబంధించి మొత్తం పది పంచాయతీలకు గానూ 61674 యూనిట్లు కలిగిన కార్డులు ఉన్నాయని, అందులో ఇప్పటివరకు 56777 యూనిట్లకు మాత్రమే ఈకేవైసీ పూర్తయిందని, మిగిలిన వారు కూడా ఈ నెలాఖరులోగా ఈకేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ నిర్మలానందబాబా అన్నారు. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఈకేవైసీ చేయించుకోని పక్షంలో మే నెల నుంచి వారికి రేషన్ కోటా ఇవ్వడం జరగదన్నారు. ప్రస్తుతం ఈ యూనిట్లకు సంబంధించి 579 మంది ఐదేళ్లలోపు ఉన్నారని, అదేవిధంగా 54 యూనిట్లు 80 సంవత్సరాలకు పైబడిన వారు ఉన్నారని, వారు మాత్రం ఈకేవైసీ చేయించుకోవాల్సిన అవసరం లేదన్నారు. మిగిలిన 4264 మంది ఈ నెలాఖరులోగా తప్పనిసరిగా వారు రేషన్ పొందుతున్న ఈ-పాస్ మిషన్లలో తప్పక ఈకేవైసీ చేయించుకోవాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

## ఆట పాటలతో కూడిన విద్యను అందిస్తున్నాం



**చుండుగుంట(కోవూరు,)ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివే చిన్నారులకు ఆట పాటలతో కూడిన మెరుగైన విద్యను అందిస్తున్నామని, ఈ కేంద్రాలను తల్లిదండ్రులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సీడీపీవో జ్యోతి అన్నారు. కోవూరు పంచాయతీ పరిధిలోని చుండుగుంట అంగన్‌వాడీ పాఠశాలలో పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా గర్భవతులకు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. మాట్లాడుతూ ప్రతి మహిళ గర్భం దాల్చిన నుంచి బిడ్డ పుట్టి రెండు సంవత్సరాల వరకు బిడ్డ సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు బలవర్థకమైన పౌష్టికాహారంతో పాటు వారిలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేలా పలు వినూత్న కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఇటువంటి మంచి అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసన్న, గర్భవతులు, బాలింతలు ఉన్నారు.

## ఫేక్ ప్రచారాలతో ప్రజలను మభ్యపెడుతున్న వైసీపీ



**కోవూరు, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** వైసీపీ పార్టీ బ్రతుకంతా ఫేక్ ప్రచారాలే అని కేవలం ఉనికిని కాపాడుకునేందుకే తమ ఇష్టానుసారంగా ముందుకు సాగుతున్నారని జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లురెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కోవూరులోని టీడీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో వైసీపీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో టీటీడీకి చెందిన పింక్ డైమండ్ చంద్రబాబు ఇంట్లో ఉందని పెద్ద ఎత్తున ప్రచారం చేశారని, తీరా వారు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ప్రచారమే లేదన్నారు. నేడు మరలా టీటీడీ గోశాలలో పెద్ద ఎత్తున గోవులు మృతి చెందాయని, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి దుష్ప్రచారం చేపట్టారన్నారు. బుధవారం సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ టీటీడీ గోశాలను పరిశీలించి అక్కడ గోశాల నిర్వహణ చాలా బాగుందని, గోవుల సహజ మరణాన్ని అసహజ మరణాలుగా చిత్రీకరించడం మంచి పద్ధతి కాదని చెప్పారన్నారు. గోశాలపై దుష్ప్రచారం కూడా తగదని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారన్నారు. దీనిని బట్టి వాస్తవాలను వైసీపీ ఏ విధంగా వక్రీకరిస్తుందో ప్రజలు గమనించాలన్నారు. మార్చి 2021 నుంచి 2024 మార్చి వరకు వైసీపీ పాలనలో గోశాలలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయని, వాటిపై ప్రభుత్వం పూర్తిగా విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఒకవైపు చిత్తుగా ఓడించినా వైసీపీలో నాయకులకు బుద్ధి రాలేదన్నారు. ఫేక్ ప్రచారాలతో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదంలో చనిపోయిన పాస్టర్‌ది హత్యే అని క్రిస్టియన్లను కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ ప్రభుత్వం అడ్డు పెట్టుకుని ముస్లింలను, టీటీడీ గోశాలలో గోవులు మృతిచెందాయని హిందువులను రెచ్చగొట్టాలని వైసీపీ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారని, ప్రజలు వాస్తవాలు గ్రహించాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

## కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



**లేగుంటపాడు( కోవూరు,) ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** చిన్నారులకు ఆట పాటలతో కూడిన విద్యను అందస్తున్న కేంద్రాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని హోమియోపతి వైద్యులు డాక్టర్ కరణాకర్ అన్నారు. కోవూరు మండలం లేగుంటపాడు గిరిజన కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మాట్లా డుతూ కేంద్రాల్లో అందిస్తున్న బలవర్థకమైన పౌష్టికాహారాన్ని చిన్నారులు, గర్భవ తులు, బాలింతలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. సీడీపీవో జ్యోతి మాట్లాడుతూ గ్రామాల్లో లభించే పాలు, గుడ్లు, ఆకుకూరలు కూడా బాలింతలు, గర్భవతులు సమపాళ్లలో తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా గర్భవతులకు, బాలింతలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సుజాత, భవాని, అపర్ణ, మనీషా, ఆయాలు ఉన్నారు.


## కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు



**వింజమూరు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త** కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని తల్లిదండ్రులు ఆలోచించి ప్రభుత్వ పాఠశాలలోనే తమ బిడ్డలను చేర్పించాలని స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్ మాలకొండయ్య తెలిపారు. గురువారం మండలంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి ఐదో తరగతి పూర్తి చేసుకుని ఉన్న విద్యార్థులను వివరాలను సేకరించి వారి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో పాటుగా మేలైన విద్యాబోధన ఉంటుందని ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే ప్రభుత్వం విద్యార్థులకు అవసరమైన పౌష్టికాహారం మధ్యాహ్న భోజన రూపంలో అందిస్తుందని సమకూప దుస్తులు పుస్తకాలు, నోటు పుస్తకాలు బూట్లు అందిస్తుందన్నారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాల మోజుల్లో పడి ప్రభుత్వ పాఠశాలను విస్మరించరాదన్నారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఆలోచించి తమ బిడ్డల బంగారు భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలలో చదివించాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులు మాల్యాద్రి, శ్రీనివాసులురెడ్డి, మల్లిఖార్జునరావు, మీరావలి, వెంకటేశ్వర్లు, కొండారెడ్డి, చందన్, శైలజ పాల్గొన్నారు.

# ఆ మహిళ శవం ఏమైంది..?





**తోటపల్లిగూడూరు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త** తోటపల్లిగూడూరు మండలంలోని కోదూరు పంచాయతీలో ఉన్న మహాలక్ష్మీపురం గ్రామ సమీపంలో రొయ్యల చెరువుపై కాపలాగా ఉన్న గిరిజన కుటుంబంలో ఓ మహిళ మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. మహాలక్ష్మి పురం నుంచి కోదూరుకు వెళ్లే రోడ్డు సీమపంలో కోదూరు బిట్టు వన్ పరిధిలో చొప్ప లక్ష్మి నారాయణ అను వ్యక్తికి రెండు ఎకరాలు రొయ్యల గుంట సాగు చేస్తున్నాడు. అయితే ఆ గుంట మీద కాపులాదారులుగా గిరిజన కుటుంబానికి చెందిన బార్య భర్త పిల్లలను ఆ గుంటపై గుడిసె వేసి కాపలాగా ఉంచాడు ఆ గిరిజన కుటుంబానికి చెందిన భార్య భర్త ఇద్దరు ఆ గుంటపై కాపలాకాస్తు రొయ్యలకు మేతలు వేసుకుంటూ అక్కడే పిల్లలను పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. అయితే ఆ రొయ్యల గుంట యజమాని లక్ష్మినారాయణ ప్రతి రోజు సాయంత్రం రాత్రి పగలుకాపలాగా ఉంటున్నగిరిజన కుటుంబాన్ని నమ్మలేక ఆ గుంటకు ఇనప కంచ నాటి దానికి రాత్రి పూట ఎందుకంటే కాపలాకాస్తున్న గిరిజన కుటుంబం కానీ లేదా ఇతరులు ఎవరైనా వచ్చి తన గుంటలోని రొయ్యలను దొంగతనం చేస్తారేమోనని ఇలా ఇనుపకంచెకు ఎర్త్ వైర్ తగిలిస్తూ ఉంటాడు. కొంత మంది చుట్టు పక్కల వారి సమాచారం మేరకు మంగళవారం రాత్రి యధాప్రకారంగా ఇనుప కంచెకు కరెంటు ఎర్త్ వైర్ తగిలించి వెళ్లాడు. నిజానికి బుధవారం ఉదయం ఆ వైరు తీసివేయాలి. గుంటలు సాగు చేయడం మొదటి రోజు నుంచి గుంటకు ఉన్న ఇనుపకంచెకు కరెంటు ఎర్త్ వైర్ రాత్రి పూట తగిలించడం ఉదయం తీసివేయడం జరుగుతూ ఉంటుంది. అయితే మంగళవారం రాత్రి తగిలించిన ఎర్త్ వేర్ బుధవారం తీయడం మర్చిపోయాడు. ఎక్కడో అల్లీపురంలో నివాసం ఉంటున్న లక్ష్మీనారాయణ బుధవారం ఉదయం కాపలాగా ఉంటున్న వారికి ఫోన్ చేసి ఇర్కంపల్లి దగ్గర ఉన్న రొయ్యల గుంట దగ్గరకు వెళ్లాలని ఆదేశించాడు. అప్పుడు గుంటల మీద ఉన్న భార్యభర్తలు ఇద్దరిలో ఒకరైన మగ మనిషి ఇల్లు కాని పల్లి వద్ద ఉన్న రొయ్యల గుంటల దగ్గరికి వెళ్లాడు. బుధవారం వీచిన గాలులకు మహాలక్ష్మీపురం వద్ద ఉన్న రొయ్యల గుంట చుట్టు టెంకాయ చెట్టు ఉండడంతో ఆ గాలులకు టెంకాయ ఆకులు విరిగి ఆ గుంటలో పడ్డాయని అక్కడే ఉన్న ఆ గిరిజన మహిళకు ఆ గుంట యజమాని లక్ష్మీ నారాయణ ఆ గిరిజన మహిళకు చెప్పాడు. దాంతో ఆ మహిళ ఆ టెంకాయ మట్టలను వేరేందుకు గుంట పైకి వెళ్లింది. మంగళవారం రాత్రి ఆ గుంటకు వేసి ఉన్న ఇనుక కంచెకు తగిలించిన కరెంటు ఎర్త్ వైర్ యజమాని తొలగించని విషయం గమణించని ఆ మహిళ ఆ కంచెను పట్టుకుంది. అప్పుడు ఆ గిరిజన మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన బుధవారం సుమారు 11 , 12 గంటల మధ్యలో జరిగినట్లు స్థానికుల సమాచారం అయితే అప్పటి నుంచి మరణించిన మహిళను ఎవరు గమణించకపోవడం చాలా బాధాకరం స్థానికులు ఇస్తున్న సమాచారం ప్రకారం.. మరణించిన మహిళ పేరు చెంచమ్మ ఆమెకు భర్త పోలయ్య, ఇద్దరు చిన్న పిల్లలు, ఒక ఆడ బిడ్డ ఒక మగ బిడ్డ ఉన్నారని, అయితే ఆమె ఆరు నెలలు గర్భవతి అని చుట్టు పక్కల వారు చెబుతున్నారు. అయితే మరో విషాధమైన విషయం ఏమిటంటే మరణించిన చెంచమ్మ కుటుంబానిది ఏ ఊరు ఎక్కడి నుంచి వచ్చారు అనే విషయం రొయ్యలగుంట యజమాని లక్ష్మి నారాయణకు తప్ప మరి ఏ ఒక్కరికి కూడా తెలియకపోవడం బాధాకరం. యజమాని లక్ష్మీనారాయణ కనీసం పక్క గుంటల వారితో గాని చుట్టు పక్కల వారీతో గాని వీరు ఎవరైనా మాట్లాడితే తీవ్రంగా ఆ గుంట మీద కాపలాకాస్తున్న చెంచమ్మ భర్త పోలయ్యను గట్టిగా మందలించేవాని చుట్టు పక్కల వారు చెబుతున్నారు. అయితే సమాచారం తెలుసుకున్న వార్త ప్రతినిధి లక్ష్మి నారాయణ ఫోన్లో సంప్రదించగా మొదట ఫోన్ ఎత్తి జరిగిన మహిళ మృతిపై వివరణ కోరగా ఒళ్ళు తిరిగి పడిపోయి మృతి చెందిందని తప్పించుకునే ప్రయత్నం చేశాడు. తరువాత పూర్తి సమాచారం కోసం ఎన్నిసార్లు ఫోన్ చేద్దామని ప్రయత్నించిన స్విచ్ ఆఫ్ చేసుకుని కనిపించకుండా పోయాడు. మృతి చెందిన గిరిజన మహిళ చెంచమ్మ మృతదేహం వద్దకు వెళ్లిన కొంత మంది ఆమెకు కరెంట్ షాక్ తగిలి శరీరం సగానికి పైగా కాలిపోయి వైర్లు ఆమెకు చుట్టుకుని ఉన్నాయని చూసిన కొంత మంది తెలిపారు. ఇంత తతంగం గత రెండు రోజులుగా నడుస్తున్న తోటపల్లిగూడూరు పోలీసులకు ఎలాంటి సమాచారం లేదని వారు చెప్పడం చాలా విచారకరం కనీసం రొయ్యల గుంటపై ఒక మహిళ మృతి చెందింది అన్న విషయం కూడా వారికి తెలియలేదని తోటపల్లిగూడూరు పోలీసులు చేతులు దులుపుకున్నారు. అయితే రొయ్యలగుంటపై ఒక మహిళ చనిపోయిందన్న సమాచారం ఏదో ఒక విధంగా పోలీసుల దృష్టికి వెళ్లింది. అది తెలుసుకున్న పోలీసులు కనీసం రొయ్యలగుంట దగ్గర కన్నా వచ్చి విచారించే ప్రయత్నం కూడా చేయకపోవడం అందరిని కలిచివేసింది. కనీసం సుమోటోగానైనా విచారణ జరిపి గిరిజనుల పక్కన పోలీసులు నిలబడి ఆ గిరిజన కుటుంబాన్ని ఆదుకునే ప్రయత్నం చేసి ఉన్న బాగుండేదని కొంత మంది విమర్శిస్తున్నారు. ఏ తప్పు జరగకుండా ఉండి ఉంటే రాత్రి 11గంటల సమయంలో మృతి చెందిన చెంచమ్మ మృతదేహాన్ని ఎందుకు తరలించాల్సి వచ్చిందో గుంట యజమాని లక్ష్మీ నారాయణ ఫోన్ ఎందుకు అందుబాటులో లేకుండా చేశాడు అన్న విషయాలపై నైనా పోలీసులు విచారణ జరిపిస్తే బాగుంటుందని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఈ కుటుంబం పై ఉన్నతాధికారులు గిరిజన నాయకులు స్పందించి అసలు లక్ష్మీనారాయణ రొయ్యలగుంటపై ఏమి జరిగింది. ఆ మహిళ ఎలాచనిపోయింది అనే దానిపై విచారణ జరిపించి ఆ ఇద్దరు చిన్న బిడ్డలను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

